సాక్షి
అనకాపల్లి



శనివారం : 22 : జూలై : 2023

న్యూస్‌రీల్

స్వల్ప వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు స్వల్ప వర్ష సూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఈ నెల 22న 12 మి.మీ, 23న 6, 24న 8, 25న 12, 26న 20 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదు కావచ్చన్నారు. ఉష్ణోగ్రతలు 29 నుంచి 33 డిగ్రీల మధ్య ఉండవచ్చన్నారు.

వచ్చే నెల 30న జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన



జాతీయ చిత్రకళా ప్రదర్శన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చోడవరం: ఆరో జాతీయస్థాయి చిత్రకళా పోటీ ప్రదర్శనను చోడవరంలో ఆగస్టు 30వ తేదీన ఏర్పాటు చేసినట్లు చిత్రకళా నిలయం నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ చెప్పారు. చిత్రకళా ప్రదర్శనకు సంబంధించిన ప్రచార పోస్టర్లను చోడవరం ప్రేమసమాజం ఆవరణలో ఫోరం ఫర్ బెటర్ చోడవరం సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనే చిత్రకారులు తమ చిత్రాలను ముందుగా నమోదు చేసుకోవాలని సూర్యనారాయణ కోరారు.

ప్రవేశ రుసుము, ఇతర వివరాలకు చోడవరం చిత్రకళా నిలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ఆర్కే ప్రసాద్, టీవీ రమణ, కన్నయ్యశెట్టి, తిరుపతిరావు, కృష్ణ పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2023 సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసే ఉద్యోగార్థులకు విశాఖ, విజయవాడ, తిరుపతిలో రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి టి.అజయ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎస్సీ/ఎస్టీ, ఇతర వర్గాలకు చెందిన పట్టభద్రుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందాలనుకునేవారు apstdc. apcfss.in వెబ్‌లింక్ ద్వారా ఆగస్టు 8 లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనలకు లోబడి కమ్యూనిటీ వారీగా ఎంపిక జరుగుతుందన్నారు.

హోం గార్డ్స్ ఆర్ఐ స్వర్ణలతకు బెయిల్ మంజూరు

విశాఖ-లీగల్ : రెండు వేల రూపాయల నోట్ల మార్పిడి కేసులో అరెస్టు అయిన హోం గార్డ్స్ ఆర్ఐ స్వర్ణలతకు బెయిలు మంజూరు అయ్యింది. ఈ మేరకు నగరంలోని ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శుక్రవారం బెయిలు మంజూరు చేశారు. నెల రోజుల క్రితం నోట్ల మార్పిడి కేసులో సీఐ స్వర్ణలతను నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. కేసును పరిశీలించిన న్యాయమూర్తి స్వర్ణలత బృందానికి షరతులతో కూడిన బెయిలు ఇచ్చారు. పోలీసులకు అందుబాటులో ఉండాలని, కోర్టు పిలిచినప్పుడు రావాలని ఆదేశించారు. రూ.10 వేల పూచీకత్తుతోపాటు ఇద్దరు జామీనుదారులను సమర్పించాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు.

చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగం

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): ప్రభుత్వ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగం పొందేలా మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని హైయర్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్.పోలా భాస్కరరావు అన్నారు. డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ , ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న విద్యకు సార్థకత కావాలంటే ఉద్యోగం రావాలన్నారు. ఆ ఉద్యోగాలను విద్యార్థులు చదవే కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా కలిపించడమే ధ్యేయంగా ప్రభుత్వం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నాయన్నారు.

ఆర్జేడీ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలలో 12 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. వీటిలో కాంతా రబ్బర్ ప్రైవేట్ లిమిటెడ్, యోకో హామా టైర్స్‌తోపాటు పలు కంపెనీలు పాల్గొన్నాయి. 11 వందల మంది విద్యార్థులు హాజరుకాగా..244 మంది ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ డాక్టర్. అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయి చైతన్య, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ క్లీన్ స్వీప్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, వేదికపై ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు బాబూరావు, కన్నబాబురాజు, అదీప్‌రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, డీసీసీబీ నూతన చైర్మన్ కోలా గురువులు

అదే మన లక్ష్యం

- ప్రతి కార్యకర్త భుజం తట్టేలా అన్ని మండలాల్లో సమావేశాలు
- సీఎం వైఎస్ జగన్ ప్రజల వద్దకే పాలన తెచ్చారు
- ఆయన సువర్ణ పాలనే విజయతీరాలకు చేరుస్తుంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను సభకు పరిచయం చేస్తున్న సుబ్బారెడ్డి

సాక్షి, అనకాపల్లి: గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జిల్లాలో ప్రభంజనం సృష్టించిందని.. అదే ఒరవడి కొనసాగిస్తూ మరోసారి క్లీన్ స్వీప్ చేయాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అనకాపల్లి రింగ్ రోడ్డులో గల పెంటకోట కన్వెన్షన్ హాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముందుగా వై.వి.సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ... దేశానికే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ నిలిచిందని.. మారుమూల గ్రామాల్లో కూడా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా.. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతి నెల ఒకటో తారీఖున వేకువజామునే ఇంటికి వెళ్లి పింఛను అందించే పాలన జగనన్న ప్రత్యేకతన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఈనాడు రామోజీరావులు కలిసి దుష్ప్రచారం చేస్తున్నారని.. వాటిని ప్రతి నాయకుడు, సోషల్ మీడియా కార్యకర్త తిప్పికొట్టాలన్నారు. త్వరలో ప్రతి మండలంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసుకుందామన్నారు. ప్రతి మండల, గ్రామ నాయకుడితో, కార్యకర్తతో మనసు విప్పి మాట్లాడతానని, సమస్యలేమైనా ఉంటే తనతో చర్చించవచ్చన్నారు.

సమన్వయంతో సాధిస్తాం

పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ.. పార్టీ నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు వెళతానన్నారు. సెప్టెంబర్ నెల నాటికి అన్ని మండలాల్లో సమావేశాలు పూర్తి చేసి... అందరూ ఏకమై పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎంపీ డాక్టర్ బి.వి. సత్యవతి మాట్లాడుతూ... ప్రజా సంకల్ప యాత్రలో రాష్ట్ర ప్రజల సమస్యలను తెలుసుకుని, సీఎంగా బాధ్యతలు చేపట్టాక నాలుగేళ్ల పాలనలో జగన్ మోహన్‌రెడ్డి 98 శాతానికి పైగా హామీలు అమలు చేశారన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. లక్షలాది పుస్తకాలు చదివానని చెప్పుకుంటున్న పవన్ కల్యాణ్, చంద్రబాబులు ఇంత బుద్ధిహీనంగా ఎందుకు మాట్లాడుతున్నారో చెప్పాలన్నారు. ప్రజా క్షేత్రంలో అందరూ జగనన్న సైనికుల్లా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ... సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత... జిల్లా, మండల స్థాయిలో ఉన్న పరి పాలనను గ్రామస్థాయిలోకి తీసుకొచ్చారని, ఇది నిజమైన గ్రామ స్వరాజ్యమన్నారు.

నమ్ముకున్న వారికి న్యాయం

డీసీసీబీ నూతన చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ... పార్టీని నమ్ముకున్న వారికి అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తప్పక న్యాయం చేస్తారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్క ఓటుతో ఓటమి చెందిన తనకు రెండు పదవులు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కన్నబాబు రాజు, అన్నంరెడ్డి అదీప్‌రాజు మాట్లాడుతూ....పవన్ కల్యాణ్‌కి రాజకీయ అనుభవం లేదని, అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబుకు చిన్న మెదడు దెబ్బతిన్నదని ఎద్దేవా చేశారు. బీజేపీ వారు ఒక ఎంపీ కూడా లేని పార్టీని పిలిచారు గానీ.. రెండు ఎంపీలు గెలిచిన చంద్రబాబుని పిలవలేదంటే.. బీజేపీకి వారిపై ఎంత ప్రేమ తుందో అర్థమవుతోందన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ... ఎన్నికల యుద్ధానికి సమయం ఆసన్నమైందని, ప్రత్యర్థికి ఎటువంటి అవకాశం ఇవ్వకుండా వచ్చే ఎన్నికల్లో దూసుకుపోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ , జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, యలమంచిలి ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు గొర్లి సూరిబాబు మాట్లాడుతూ.... రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సింగిల్‌గా ముందుకు వెళ్తుందని.. ఐక్యంగా పనిచేసి ప్రతిపక్షాల గుంపును చెదరగొట్టాలన్నారు.

ప్రజాప్రతినిధులకు సత్కారం

విజయవాడ వెళ్లిన కారణంగా చివర్లో సమావేశానికి చేరుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సుబ్బారెడ్డితో కలిసి ఎంపీపీలు, జెడ్పీటీసీలను సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బొలిశెట్టి గోవింద్, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ, ముఖ్య నేతలు సన్యాసిపాత్రుడు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పార్టీ నేతలను సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి స్థల పరిశీలన

చందనాడ, దొండవాకలలో పర్యటించిన జేసీ జాహ్నవి



దొండవాకలో స్థల పరిశీలన చేస్తున్న జేసీ జాహ్నవి

నక్కపల్లి: మండలంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్, జెట్టీల నిర్మాణ ప్రక్రియ ఊపందుకుంది. శుక్రవారం జాయింట్ కలెక్టర్ జాహ్నవి చందనాడ, దొండవాకలలో పర్యటించి ప్రతిపాదిత స్థలాలను పరిశీలించారు. నక్కపల్లి మండలానికి ప్రభుత్వం ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.42 కోట్లు కేటాయించాయి. పదెకరాల స్థలం అవసరం కావడంతో స్థానిక రెవెన్యూ అధికారులు దొండవాక, చందనాడ రెవెన్యూ పరిధిలో స్థలాలను ఎంపిక చేసి కలెక్టర్‌కు ప్రతిపాదన పంపించారు. పెదతీనార్ల శివారు దొండవాక సర్వే నెంబరు 26లో 5 ఎకరాలు, చందనాడ సర్వే నెంబరు 170లో 3.50 ఎకరాలను గుర్తించి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. దొండవాకలో జెట్టీని నిర్మించి, చందనాడలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటి నిర్మాణాలకు అవసరమైన స్థలాలు ఈ రెండు గ్రామాల్లోనే అందుబాటులో ఉండటం, వీటిని నిర్మించేందుకు అనువుగా ఉండటంతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

నక్కపల్లి మండలానికి మంజూరు చేసిన ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా జేసీ జాహ్నవి చందనాడ, దొండవాకలలో పర్యటించి అధికారులు ప్రతిపాదించిన స్థలాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని జేసీ తెలిపారు. ప్రక్రియ పూర్తయితే జెట్టీ, ఫిష్‌ల్యాండింగ్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే కలెక్టర్, జేసీ, ఆర్‌జేడీ, ఢిల్లీ నుంచి నిపుణుల బృందం, మత్స్యశాఖ అధికారులు పలు పర్యాయాలు స్థల పరిశీలన చేశారని, ఈ ప్రక్రియ పూర్తి చేసి పనులు త్వరగా ప్రారంభించాలని మత్స్యకారులు కోరుతున్నారు. జేసీ వెంట తహసీల్దార్ అంబేద్కర్, డీటీ నీరజ, మత్స్యశాఖ అధికారులు, సర్వేయర్లు, స్థానిక మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో వ్యవసాయ కాలువల మరమ్మతులు



జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న చిక్కాల రామారావు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు వినతి

తుమ్మపాల: జిల్లాలో వ్యవసాయ కాలువల మరమ్మతులను సీఎస్ఆర్ నిధులతో పూర్తిచేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు వ్యవసాయ సంబంధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలన్నారు. డీఆర్వో పి.వెంకటరమణ మాట్లాడుతూ నీటిపారుదల శాఖకు సంబంధించి గ్రీవెన్స్‌లను వేగంగా పూర్తిచేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిని, తీసుకున్న చర్యలను వివరించారు. జీడిమామిడి, తమలపాకు వంటి ఉద్యాన పంటల భీమాపై నివేదికలు సమర్పించారు. ఇండో ఫారం ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ట్రాక్టర్లకు సబ్సిడీపై సర్వీసింగ్ చేయించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక డ్రోన్ పైలట్‌ను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. పీఎం కిసాన్‌లో ఈకేవైసీ ప్రక్రియ 86 శాతం పూర్తయిందన్నారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు సరఫరా చేయనున్నట్టు తెలిపారు. సంపూర్ణ మిశ్రమ దాణా, గడ్డికోత పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. వ్యవసాయ బీమా నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కొత్తగా నియమిస్తామన్నారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించే పరికరాలపై నివేదికను అధికారులకు తెలిపామని, ఇప్పటి వరకు 85 హెక్టార్లకు పరిపాలన అనుమతులు రాగా, 12.62 హెక్టార్లకు పరికరాలు అందించామన్నారు. మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్ ఎంపీఎఫ్‌సీల ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో ఉద్యానశాఖ ఏడీ ప్రభాకరరావు, సెరీకల్చర్ ఏడీ వర్మ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు ఎస్.రమణ, జి.ఆనందరావు, ఆర్.గంగునాయుడు, ఎ.పాండు పాల్గొన్నారు.

వైఎస్సార్ నేతన్న నేస్తం రూ.64.84 లక్షలు జమ

జిల్లాలో 270 మంది నేత కార్మికులకు లబ్ధి



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న జేసీ జాహ్నవి, ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్, డీఆర్వో వెంకటరమణ

తుమ్మపాల: చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి కుటుంబానికి ఏడాది రూ.24 వేలు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని జేసీ ఎం.జాహ్నవి అన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీతోపాటు ఎంపీ బీవీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ వీక్షించారు. జిల్లాలో 270 మంది లబ్ధిదారులకు రూ.64.84 లక్షలను జమ చేస్తూ చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో 2023–24 సంవత్సరానికి చెల్లించే రూ.24 వేలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం నేతన్నలకు రూ.3.42 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. గత ఏడాది 20 చేనేత సహకార సంఘాల ద్వారా రూ.6.50 కోట్లు విలువ గల వివిధ రకాల చేనేత ఉత్పత్తులను విక్రయించినట్టు తెలిపారు. చేనేత జౌళి శాఖ ద్వారా 50 ఏళ్లు నిండిన కార్మికులను ఆదుకోవాలనే సంకల్పంతో జిల్లాలో 3,380 మందికి నెలకు రూ.2,500 చొప్పున పింఛన్ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ అభివృద్ధి అధికారి బి.సునీల్‌కుమార్, చేనేత సొసైటీల అధ్యక్షులు జి.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాడు కాంట్రాక్టర్‌గా... నేడు డిప్యూటీ సీఎంగా.. ప్రగతి బాట

- రూ. 1.50 కోట్లతో వరహాపురం నుంచి పెదగోగాడ వరకు తారురోడ్డు
- రూ.1.45 కోట్లతో ముసిడిపల్లి నుంచి కె.ఎం.పాలెం వరకు రహదారి



ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



అద్దంలా మెరుస్తున్న దేవరాపల్లి-మారేపల్లి రోడ్డు

చీడికాడ/దేవరాపల్లి: నాడు కాంట్రాక్టర్‌గా చీడికాడ మండలం వరహాపురం నుంచి పెదగోగాడ వరకు రోడ్డు వేశానని, నేడు అదే రోడ్డును డిప్యూటీ సీఎం హోదాలో వేయిస్తున్నానని బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన చీడికాడ మండలం ఎ.అగ్రహారం, దేవరాపల్లి మండలం తారువ క్యాంప్ కార్యాలయంలో వేర్వేరుగా మాట్లాడారు. 1994లో తాను కాంట్రాక్టర్‌గా ఉన్నప్పుడు వరహాపురం నుంచి పెదగోగాడ వరకు మట్టి రోడ్డును తారురోడ్డుగా వేశానని, 29 ఏళ్ల తర్వాత ఇప్పుడు డిప్యూటీ సీఎంగా సి.ఎం.ఎఫ్ (సెంట్రల్ మార్కెట్ ఫండ్) నుంచి రూ.1.50 కోట్లతో వేస్తున్నానన్నారు. చీడికాడ మండలానికి చెందిన సీనియర్ నేత ఐదేళ్లు ఎమ్మెల్యేగా, మరో ఐదేళ్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి తట్టడు మట్టి ఎత్తి ఏ రోడ్డులో పోసిన పాపాన పోలేదన్నారు. నేడు తప్పుడు మాటలాడుతున్నాడని, కనీసం ఆయన తిరుగుతున్న అప్పలరాజుపురం, చీడికాడ రోడ్డును పట్టించుకోలేదన్నారు. ఆ రోడ్డును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో తానే ఇప్పుడు నిర్మిస్తున్నానన్నారు. దేవరాపల్లి మండలంలో ముసిడిపల్లి నుంచి కె.ఎం.పాలెం రోడ్డుకు రూ.1.45 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆనందపురం–దేవరాపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ముషిడిపల్లి జంక్షన్, ముషిడిపల్లి, కె.ఎం. పాలెం మీదుగా 5.6 కిలోమీటర్ల మేర ఈ నిధులతో తారురోడ్డు నిర్మిస్తామన్నారు.

దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే దాదాపుగా నెలరోజుల్లో నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. బోయిలకింతాడ నుంచి కాశీపురం వరకు రూ.20 కోట్లతో డబుల్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి కాగానే తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించగా, సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యత కల్గిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతోపాటు డిప్యూటీ సీఎం పదవి కల్పించడంతోనే నియోజకవర్గంలో ఇంతటి అభివృద్ధి సాధ్యపడిందన్నారు.

సీఎం జగన్‌కు తామంతా జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో చీడికాడ ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, నాయకులు చుక్కా అప్పలనాయుడు, గంటా మత్స్యరాజు, సలాది గంగాశేషు పాల్గొన్నారు.

ప్రవీణ్ ప్రకాష్ కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



ప్రవీణ్ ప్రకాష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)న్ని ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రాత్రి 10 గంటలకు ఆయన కేజీబీవీకి వచ్చారు. విద్యాలయంలో అన్ని బ్లాకులను పరిశీలించారు. తరగతి గదులు, డార్మెటరీ, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది? మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారా? తదితర విషయాలపై ఆరాతీశారు. శనివారం ఉదయం అమలాపురం, రాజయ్యపేట తదితర పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు తెలిసింది. ప్రవీణ్ ప్రకాష్ వెంట పాఠ్యపుస్తకాల విభాగం డైరక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌జేడీ జ్యోతికుమారి, డీఈవో వెంకటలక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

ప్రవీణ్ ప్రకాష్‌ను కలిసిన ఎమ్మెల్యే : మండలంలో పాఠశాలల తనిఖీకి వచ్చిన ప్రవీణ్ ప్రకాష్‌ను స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కలిశారు. కేజీబీవీలోకి వెళ్తున్న ఆయనను ఎమ్మెల్యే బా బూరావు మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో నెలకొన్న విద్యాసమస్యలను క్లుప్తంగా వివరించారు. శనివారం మరోసారి కలిసి పూర్తి స్థాయిలో సమస్యలపై చర్చించనున్నట్టు మీడియాకు తెలిపారు.

డీఆర్ఎంగా సౌరభ్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సౌరభ్ ప్రసాద్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి పదోన్నతిపై బదిలీ అయ్యారు. 1991 ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ బ్యాచ్‌కు చెందిన సౌరభ్ ప్రసాద్ సెంట్రల్ రైల్వే, వెస్టర్న్ రైల్వే, వెస్ట్ సెంట్రల్ రైల్వే, కొంకణ్ రైల్వేలలో వివిధ హోదాలలో పనిచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన సన్యాసినాయుడు


తీవ్రంగా గాయపడిన శివశంకర్

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ కృష్ణదేవిపేట రూట్‌లోని పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. టౌన్ సీఐ గణేష్ అందించిన వివరాలు...గొలుగొండ మండలం నల్లంకి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై నర్సీపట్నం వచ్చారు. తిరిగి వెళ్తూ పెట్రోల్‌బంక్‌లో పెట్రోలు వేయించుకని రోడ్డు మీదకు వస్తున్నారు. అదే సమయంలో అదే మండలం పాకలపాడుకు చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న ముకల సన్యాసినాయుడు ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పాకలపాడుకు చెందిన సన్యాసినాయుడు, నల్లంకికి చెందిన కె.శివశంకర్ తీవ్రంగా గాయపడ్డారు. లోవరాజు, దుర్గాప్రసాద్ స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. సన్యాసినాయుడు, శివశంకర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..

- నర్సీపట్నం మెయిన్ రోడ్డు 100 అడుగుల విస్తరణకు శ్రీకారం
- పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్


యంత్రాలతో కట్టడాల తొలగింపు


అధికారులతో కలిసి రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రజలు ఎన్నోయేళ్లుగా ఎదురు చూస్తున్న నర్సీపట్నం పట్టణవాసుల కల సాకారమైంది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కృషితో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఆయన కొబ్బరికాయ కొట్టి స్థానిక అబిద్‌సెంటర్ నుంచి పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా జేసీబీలతో ఎన్టీఆర్ స్టేడియానికి ఆనుకున్న షాపుల తొలగింపు చేపట్టారు. రోడ్డు విస్తరణ చేస్తామని గత పాలకులు చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. ఎమ్మెల్యే గణేష్ ప్రజలకు హామీ ఇవ్వకపోయినా మెయిన్ రోడ్డును వందడుగులకు విస్తరించాలని సంకల్పించారు. 60 ఏళ్లుగా విస్తరణకు నోచుకోని నర్సీపట్నం మెయిన్‌రోడ్డు, గొలుగొండ మండలం అరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పటికీ ధైర్యంగా ముందుడుకు వేసి సాధించారు. మున్సిపాలిటీ, నియోజకవర్గ ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు.

భవిష్యత్తు తరాల కోసం వందడుగుల మేర రోడ్డు విస్తరణ...

ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు విస్తరణకు రూ.16 కోట్ల మంజూరు చేయటమే కాకుండా స్వయంగా గతేడాది పనులకు శంకుస్థాపన చేశారు. కొన్ని నెలలుగా ఎన్నో అవాంతరాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. రోడ్డు విస్తరణ చేసి తీరాలనే పట్టుదలతో ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ముందడుగు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష, ట్రాఫిక్ సమస్యను అధిగమించడంతోపాటు భవిష్యత్తు తరాల కోసం వందడుగుల మేర రోడ్డు విస్తరణ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రెండు లక్షల మంది జనాభాతోపాటు నిత్యం పాడేరు, పాయకరావుపేట నియోజకవర్గాల నుంచి వేలాది మంది నర్సీపట్నం వస్తుంటారన్నారు. ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రోడ్డు విస్తరిస్తున్నామన్నారు. కొంత మంది భవన యజమానులకు నష్టం వాటిల్లినా రోడ్డు విస్తరణ చేయకతప్పలేదన్నారు. దీనికి వారంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హెచ్.వి.జయరాం, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడపాటి సుబ్బలక్ష్మి, కమిషనర్ కనకారావు, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ, మహిళా విభాగం టౌన్ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనివాసరావు, అర్జున్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, వివిధ దేవస్థానాల చైర్మన్లు ధనిమిరెడ్డి నాగు, చెరుకూరి సత్యనారాయణ, పార్టీ నాయకులు మామిడి శ్రీను, యాదగిరి శేషు, లలిత, శారద, వరలక్ష్మి పాల్గొన్నారు.


రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

సుమారు రూ.కోటి చెల్లించకుండా మహిళ పరార్


రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

తుమ్మపాల: చిట్టీల పేరుతో రూ.కోటి వరకు వసూలు చేసిన ఓ మహిళ పలువురికి కుచ్చుటోపీ పెట్టింది. మండలంలో రేబాక పంచాయతీ గురజాడనగర్‌లో నివాసముంటున్న మెల్లి వరలక్ష్మి ఐదేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. నెల నెలలా నగదు వసూలు చేస్తూ చిట్టీ పాటలు నిర్వహించేది. మొదట్లో పాడుకున్న వారికి బాగానే నగదు చెల్లించింది. క్రమేణా నగదు చెల్లింపుల్లో జాప్యం చేస్తూ వచ్చింది. చిట్టీలు పాడుకున్న వారికి ఆర్నెల్ల నుంచి నగదు చెల్లింపులు చేయలేదు. తన తండ్రి బోడి అప్పారావుకు చెందిన ఇంటిపై బ్యాంకు రుణం తీసుకుని చెల్లింపులు చేస్తానని నమ్మబలికి, తీరా బ్యాంకు రుణం వచ్చిన వెంటనే పరారైంది. విజయవాడలో గల తమ బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి ఈ నెల 18న వెళ్లిన ఆమె ఇప్పటికీ రావకపోవడంతో అనుమానం వచ్చిన ఖాతాదారులు ఫోన్ చేశారు. ఫోన్ పనిచేయడం లేదని గ్రహించారు. ఆమెతో పాటు ఆమెకు సాయం చేసిన మరో ఇద్దరిపై శుక్రవారం అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తామని రూరల్ ఎస్ఐ నరసింహారావు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బాధితులు సుందరపు చినతల్లి, బోడి అప్పలనాయుడు, చిన్నాల సోమేశ్వరరావు, బోడి లక్ష్మి, కాపుశెట్టి కల్యాణి,బోగ రమణమ్మ, బుద్ధ నాయుడు, ధనుకొండ సరస్వతి ఉన్నారు.

పనసలపాడు భూముల పరిశీలన


సీపీఎం నాయకులతో చర్చిస్తున్న ఆర్డీవో జయరాం

రోలుగుంట: పనసలపాడు రెవెన్యూ పరిధిలో 2,3,4,6,11 సర్వే నంబర్లలో భూములను శుక్రవారం ఆర్డీవో జయరాం పరిశీలించారు. ఈ సర్వే నంబర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు జారీ చేసిన పట్టాలను రద్దు చేసి, సాగు చేస్తున్న గిరిజనలు,దళితులకు పట్టాలివ్వాలిని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దీనిపై నర్సీపట్నం ఆర్డీవో జయరాం విచారణ జరిపారు. సాగు ఆధార ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ముందుగానే నోటీసు లు జారీ చేశారు. ఆ సర్వే నంబర్లల్లో రైతులను కలిసి, సాగు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె.గోవింద, ఇ.చిరంజీవి, దళిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పాల్తేటి పెంటారావు ఆర్డీవోను కలసి సమస్యను వివరించారు. రైతుల సాగులో ఉన్న భూములకు స్థానికేతరులైన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయడం వెనుక రెవెన్యూ సిబ్బంది హస్తం ఉందని ఆరోపించారు. సాగుదారుల వద్ద ఉన్న ఆధారాలు, భూములను ఆర్డీవో పరిశీలించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని ఆయన తెలిపారు.ఆర్ఐ రామ్మూర్తి పాల్గొన్నారు.

14 క్వింటాళ్ల బియ్యం పక్కదారి


విచారణ చేస్తున్న డీటీ ఈశ్వరరావు

మాకవరపాలెం: రేషన్ బియ్యం పంపిణీ చేయలేదంటూ అందిన ఫిర్యాదుపై అధికారులు విచారణ జరిపారు. మండలంలోని కొత్తపాలెం, రాచపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో రేషన్ సరకుల పంపిణీలో మొబైల్ ఆపరేటర్ నాగరాజు అక్రమాలకు పాల్పడుతున్నాడని లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొత్తపాలెంలో శుక్రవారం సివిల్ సప్లయి డీటీ ఈశ్వరరావు విచారణ చేశారు. ఈ విచారణలో 14 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టినట్టు గుర్తించారు. తన తప్పును అంగీకరించి నాగరాజు స్వచ్ఛందంగా తన విధులకు రాజీనామా చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాన్ని వేరొకరికి అప్పగించనున్నట్టు డీటీ తెలిపారు. వీఆర్వో సింహాద్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాల వ్యాపారి మృతి

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాల వ్యాపారి దుర్మరణం చెందాడు. అదనపు ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు అందించిన వివరాలు...మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన చామంతుల చంద్రరావు(32) పాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి బయ్యవరంలో పాలు సేకరించి వాటిని విక్రయించడానికి తన స్కూటీపై కశింకోటకు వస్తుండగా మార్గమధ్యంలో పీఏసీఎస్ సమీపానికి వచ్చేసరికి గుర్రం అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో మొదట అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి, తరువాత మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు.అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు


పట్టుబడిన గంజాయి,నిందితులతో ఎస్ఐ రంజిత్‌కుమార్, పోలీసు సిబ్బంది

బుచ్చెయ్యపేట: గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం వడ్డాది జంక్షన్‌లో పాడేరు నుంచి చోడవరం వైపు వెళ్తున్న జీపును తనిఖీ చేసినట్టు చెప్పారు. జీపులో తరలిస్తున్న 21కిలోల గంజాయితోపాటు మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, నలుగురిని పట్టుకుని విచారించినట్టు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించినట్టు తెలిపారు. కొర్రా రాజారావు అనే వ్యక్తి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలోని నాగర్సోల్ ప్రాంతానికి చెందిన సుభాష్ పైధాకర్ దత్తాత్రేయ అనే వ్యక్తికి పంపుతున్నట్టు వారు చెప్పారని ఎస్ఐ తెలిపారు. గురువారం నలుగురిని, శుక్రవారం కొర్రా రాజారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, చోడవరం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

10 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

సాక్షి,పాడేరు: మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన రోడ్డులో కందమామిడి జంక్షన్ వద్ద రవాణాకు సిద్ధం చేసిన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు.కందమామడి జంక్షన్‌లో ముగ్గురు గంజాయితో ఉన్నారనే సమాచారం మేరకు శుక్రవారం తనిఖీలు చేపట్టామన్నారు. నిందితుల నుంచి 10 కిలోల గంజాయి,మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుల్లో ఒకరు తమిళనాడువాసి కాగా, మిగతా ఇద్దరు ఇద్దరు ఏజెన్సీకి చెందిన వారని, వీరిలో ఒక యువతి కూడా ఉన్నారని ఎస్ఐ తెలిపారు.నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.

67 మద్యం సీసాల స్వాధీనం

అనకాపల్లి రూరల్:ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చిన 67 మద్యం బాటిళ్లను అనకాపల్లి సెబ్ స్టేషన్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామ శివార్లలో కొందరు వ్యక్తులు యానాం నుంచి కొనుగోలు చేసిన మద్యం బాటిళ్లను అక్రమంగా అమ్ముతున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సెబ్ సీఐ జగన్నాథరాజు ,సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి తనిఖీలు చేశారు.సెబ్ పోలీసులు వస్తున్నట్టు గమనించిన నిందితులు అక్కడ్నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేశామని,నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని సెబ్ పోలీసులు తెలిపారు.

జగనన్న సురక్ష సేవల్లో శృంగవరం ముందంజ


ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: జగనన్న సురక్ష సేవలందించడంలో శృంగవరం గ్రామ సచివాలయం ముందంజలో ఉండటం గర్వకారణమని తహసీల్దార్ ఎస్.వి.వి. శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. మండలంలోని శృంగవరం సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతోపాటు సర్పంచ్ ఉలబాల యర్రయ్యమ్మ శ్రీనివాస్ దంపతులను ఆయన అభినందించారు. సచివాలయం ద్వారా 3,100పైగా ఉచితంగా సేవలందించారన్నారు. వలంటీరు ఎల్.సీత అధికంగా 289 మందికి పలు రకాల సేవలు అందించారన్నారు. ఆన్‌లైన్ నివేదిక ప్రకారం శృంగవరం సచివాలయం రాష్ట్ర స్థాయిలో తృతీయ, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్నట్టు తెలిసిందన్నారు. ఇక్కడ అంతా సమష్టిగా పని చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఉలబాల శ్రీనువాస్, ఈవోపీఆర్డీ చినబాబు, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల రాంబాబు పాల్గొన్నారు.

60 రోజుల్లోనే విద్యుత్ సమస్యల పరిష్కారం

- 7,479 ఫిర్యాదులకుగాను 7,410 కేసుల పరిష్కారం
- వినియోగదారుల వేదిక సభలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ


విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు

చోడవరం: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉన్నట్టు సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు. ఏపీ ఈపీడీసీఎల్ చోడవరం సబ్ డివిజనల్ పరిధి విద్యుత్ వినియోగదారుల సదస్సు చోడవరంలో గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని, ఇటీవల గృహోపకరణాలు కాలిపోయాయని పలువురు ఫిర్యాదు చేశారు. అన్నవరం ఫీడర్‌లో తరుచూ విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతున్నా, సిబ్బంది సకాలంలో స్పందించడం లేదని మరికొంత మంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. సిబ్బంది కొరత, సబ్ స్టేషన్‌తోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరడంతో వాటిపై చర్యలకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తామని ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణ చెప్పారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరు 1912కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. వెంటనే సమస్య పరిష్కారం కానుందన్నారు. టోల్‌ఫ్రీ ద్వారా పరిష్కారం కాని వాటిపై రాతపూర్వకంగా ఫిర్యాదు వచ్చిన 60 రోజుల్లోనే పరిష్కరిస్తామన్నారు. బిల్లుల్లో తేడాలు, పేరు మార్పులు వంటివి కూడా ఫోరం పరిష్కరిస్తుందన్నారు. ఇచ్చిన గడువులోగా పరిష్కరించకపోతే డిపార్టుమెంటు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని, కరెంటు పోయిన ఆరు గంటల్లోగా పునరుద్ధరించకపోయినా ఆ శాఖ అధికారులు బాధ్యత వహించాలన్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు 176 కేసుల్లో రూ. 5.39 లక్షల నష్టపరిహారాన్ని వినియోగదారులకు ఇప్పించామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 7,479 ఫిర్యాదులు ఇప్పటి వరకు తమ ఫోరానికి అందగా, 7,410 కేసులు పరిష్కరించామన్నారు. ప్రతి జిల్లాలోనూ వినియోగదారుల వేదిక క్యాంప్‌లు నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. ఫోరం సభ్యులు ఎస్. హరిబాబు, సురేంద్రకుమార్, విద్యుత్ శాఖ ఈఈ రామకృష్ణ, ఏడీఈఈ ఉప్పులూరి గౌరీప్రసాద్ పాల్గొన్నారు.

ఏఆర్ పోలీసులకు క్రమశిక్షణ అవసరం


కైలాసగిరి ఏఆర్ గ్రౌండ్‌లో ఎస్పీ మురళీకృష్ణకు గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు క్రమశిక్షణ, శరీర దారుఢ్యం కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి పోలీసులు పరేడ్ నిర్వహించి గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఏఆర్ పోలీసులు ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదాలు, ఎక్కడైనా జరిగే నిరసనలు, ఆందోళనల వద్ద లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలసి సమన్వయంతో పని చేయాలన్నారు. వచ్చేనెల స్వాతంత్ర్య వేడుకలకు సన్నద్ధం కావాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 19 మంది తమ అనారోగ్య సమస్యల గురించి ఆయనకు విన్నవించారు. ఆయా అర్జీలను వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు రామకృష్ణారావు, వెంకటరావు, సతీష్, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరుపేద మహిళలకు బియ్యం పంపిణీ



మహిళలకు బియ్యం పంపిణీ చేస్తున్న భారత వికాస పరిషత్ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: భారత వికాస పరిషత్ అనకాపల్లి శాఖ అధ్యక్షుడు ఎ.రాము ఆధ్వర్యంలో తుమ్మపాల గ్రంథాలయం వద్ద శుక్రవారం 50 మంది నిరుపేద మహిళలకు 5 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. పేదలకు సహాయపడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి ఎస్ఏబీ వర్మ, కోశాధికారి దాడి శివరాము, పిళ్లా నిర్మల, వై.కేశవరావు, దాట్ల రాఘవరావు, ఎస్.కాళిదాసు, శేషగిరిరావు, మూర్తి, గోపాలరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా శిష్టకరణ సమితి వార్షికోత్సవం రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఈ నెల 23న జిల్లా శిష్టకరణ సమితి 53వ వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశాలను నిర్వహించనున్నట్లు సమితి జిల్లా ప్రచార కార్యదర్శి ఎస్.ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర శిష్టకరణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ అనూష శ్రీధర్ పట్నాయక్, సమితి జిల్లా అధ్యక్షుడు శేఖరమంత్రి వి.ఎస్.పట్నాయక్‌లు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. సమితి కుటుంబ సభ్యులంతా హాజరుకావాల్సిందిగా కోరారు.

ఓటరు సర్వేను పారదర్శకంగా జరపాలి

తుమ్మపాల: బీఎల్వోలు, ఎన్నికల అధికారులు సమగ్ర ఓటరు పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ కోరారు. జీవీఎంసీ 84వ వార్డులోని కొత్తూరు నర్సింగరావుపేటలో బూత్ నెం.249 బూత్, కశింకోట మండలం కొత్తపల్లి గ్రామంలో బూత్ నెం.42 పరిధిలో జరిగిన ఓటరు సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తన ఓటును సరిచూసుకోవాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటును నమోదు చేసుకోవాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 29 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,650	4,650
రెండో రకం	------	------
మూడోరకం	------	------

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
హిడింబ	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
హత్య	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
కార్తీక	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-39 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైనవారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 398 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కలుపు నిర్మూలిస్తే గెలుపు

ఖరీఫ్ సీజన్ ఊపందుకుంది. వరి సాగులో నారు మడులకు అనుకూల సమయమిదే. వెద పద్ధతిలో సాగు చేసేవారికి నారు పోయాల్సిన పనిలేదు. నీటి వసతి ఉన్న చోట, దమ్ము పెట్టాలనుకునేవారికి నారు మడి నుంచే సస్య రక్షణ చర్యలు తప్పనిసరి. విత్తన శుద్ధి నుంచి కలుపు యాజమాన్యం వరకు నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు రైతులకు సాయపడుతున్నారు.

- సస్య రక్షణ, కలుపు యాజమాన్యంపై రైతులకు అవగాహన
- సబ్ డివిజన్‌లో 61 శాతం, మండలంలో 80 శాతం నారు పోత



తుమ్మపాల సమీపంలో వరి నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అనకాపల్లి రూరల్: బోర్ల సదుపాయం ఉన్న పొలాలతో పాటు అడపా దడపా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఖరీఫ్ వరి నారుమడులకు శ్రీకారం చుడుతున్నారు. అధిక దిగుబడులు సాధించేలా రైతులు ఈ తరుణంలోనే ఆరోగ్యకరమైన నారు పెంచేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నారుమడులు, కలుపు యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన పెంచుతున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి నారుమడులను పరిశీలించి, రైతులకు ప్రత్యక్షంగా నారుమడుల వద్దే కలుపు యాజమాన్య పద్ధతులను వివరిస్తున్నారు.

నారుమడి తయారీ విధానం

నారుమడికి ఎంచుకున్న నేల సారవంతంగా ఉండాలి. ఇది పొలానికి ఎప్పుడూ మెరకలో ఉండాలి. వీలైనంత వరకూ పల్లపు ప్రాంతం ఎంచుకోరాదు. ఎకరం పొలానికి 3 సెంట్ల నారుమడి తయారుచేసుకోవాలి. పది పన్నెండు రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము, చదును చేసి, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా గాడి తీసుకోవాలి. ఆఖరి దుక్కిలో వీలైనంత వరకూ బాగా చివికిన సేంద్రీయ ఎరువులు వేసి కలియ దున్నుకోవాలి. కలుపు లేకుండా చూసుకోవాలి. దీంతో వేరు వ్యవస్థ దృఢంగా, నారు తీసేటప్పుడు తెగిపోకుండా ఉంటుంది.

విత్తన శుద్ధి తప్పనిసరి

ఎకరం విస్తీర్ణానికి 15 కేజీల నాణ్యమైన విత్తనాలు సరిపోతాయి. విత్తే ముందు విధిగా విత్తన శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి కార్బండిజమ్ 25 శాతం, మాంకోజెబ్ 50 శాతం, మిశ్రమ శిలీంద్రనాశని 2 గ్రాములు తీసుకుని, లీటరు నీటిలో కరిగించి విత్తనాలకు పట్టించాలి. ఈ విత్తనాలను 36 గంటలు



చెరకాంలో సాగులో ఉన్న వరి నారుమడి

నానబెట్టి, 24 గంటలు మడికట్టి, కోర వచ్చిన తర్వాత సాయంత్రం పూట నారు మడి నిండా నీరు పెట్టి సెంటుకు 5 కిలోల చొప్పున వెదజల్లాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులు దుక్కిలో వేయాలి. విత్తిన పది రోజులకు, 17 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటుకు 160 గ్రాముల చొప్పున వేయాలి. బదులుగా మోనోక్రోటోఫాస్ 361 ఎస్ఎల్-16 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 20/ఇసి 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయొచ్చు.

కలుపుతో పంటకు నష్టం

సబ్ డివిజన్‌లో ఈ సీజన్లో మొత్తం 6,587 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. విత్తనం వేసింది మొదలుకుని రైతును బాధించే సమస్య కలుపు. సకాలంలో కలుపు యాజమాన్య చర్యలు చేపట్టకపోవడం వలన ఏటా 25-30 శాతం పంట నష్టం వాటిల్లుతోందని అంచనా. కలుపు వలన పంట దిగుబడి, నాణ్యత తగ్గి, పోషక పదార్థాల నష్టం, పెట్టుబడి ఖర్చు పెరుగుదల వంటివి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కలుపు పెరుగుదలకు వేసవిలో లోతు దుక్కులు చేయకపోవడం, పైరు, కలుపు ఒకేసారి మొలకెత్తడం, పంట కన్నా కలుపు పెరుగుదల వేగంగా ఉండటం, తేమ శాతం అధికమవడం, సరైన ఎరువుల యాజమాన్యం పాటించకపోవడం కారణాలుగా వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

సబ్ డివిజన్‌లో వరి నారు సాగు

మండలం	నారు సాగు శాతం
అనకాపల్లి	80
కశింకోట	60
మునగపాక	45
సబ్బవరం	70
పరవాడ	50

నారు మడులకు అనుకూలం



ప్రస్తుతం వాతావరణం చల్లబడి సాగుకు అనుకూలంగా ఉన్నందున రైతులు త్వరగా నారుమడులు వేసుకోవాలి. ఇప్పటికే బోర్ల సదుపాయం ఉన్న రైతులంతా నారుమడులను వేశారు. వారం రోజులుగా కొద్దిపాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వేసిన నారుమడులకు జీవం వచ్చింది. సరైన కలుపు యాజమాన్యం చేపడితే నారు ఆరోగ్యంగా ఎదుగుతుంది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను సైతం తట్టుకునే వరి రకాన్ని సాగు చేయడం మంచిది. రైతులకు ఎల్లవేళలా సలహాలు అందిస్తున్నాం

– ఎం.రామారావు, ఏడీఏ, అనకాపల్లి సబ్‌డివిజన్

జగనన్న సురక్ష గ్రాండ్ సక్సెస్

- కశింకోటలో ముగిసిన 'జగనన్న సురక్ష'
- అధికారులకు స్థానిక నేతల సత్కారం



మండల ప్రత్యేక అధికారి రోజారాణికి సత్కారం



ధ్రువపత్రాన్ని అందిస్తున్న బుల్లిబాబు, కలగా లక్ష్మి

కశింకోట: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. చివరిగా కశింకోట 2, 4 సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించారు. 2వ సచివాలయం పరిధిలో 222, 4వ సచివాలయంలో 247 కలిసి మొత్తం 469 ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు అందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఇతర అధికారులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కలగా లక్ష్మి మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ప్రజల సహకారంతో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ క్లినిక్‌ల వైద్య, ఆరోగ్య సిబ్బందితో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు అందించారు. సర్పంచ్ మంత్రి జయరజని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మూడు వారాల్లో పూర్తి చేశారు

ఈ నెల 1 నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 9,979 ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి రోజుకు రెండు సచివాలయాలు చొప్పున, రోజు విడిచి రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి చోట విశేష ఆదరణ లభించింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారం రోజుల ముందు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల అభ్యర్థనలను అధికారులకు నివేదించారు. వీటిని అధికారులు పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేశారు. వీటిలో అత్యధికంగా కుల, ఆదాయ ధ్రువ పత్రాలున్నాయి. జిల్లా, మండల కార్యాలయాలకు వెళ్లి, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పనిలేకుండానే జగనన్న సురక్షలో తమ చెంతకే వచ్చి సర్టిఫికెట్లు అందించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి

- జగనన్న సురక్షలో 773 మందికి ధ్రువపత్రాల పంపిణీ



ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లిటౌన్: జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ అక్కిరెడ్డిపాలెం గ్రామం నుంచి రహదారులను నిర్మించి, గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో ఎంపీడీవో కె.వి.నరసింహరావు ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గ్రామాలను నిర్లక్ష్యం చేశాయని, జగనన్న ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో రూ.3.60 కోట్లతో నూతన రహదారులను నిర్మించినట్టు వెల్లడించారు. సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్బీకే భవనాలకు చెరో రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.60 లచ్చలతో నిర్మాణాలు పూర్తి చేసినట్టు వెల్లడించారు. నాడు-నేడు పథకంలో సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లిన శీరంశెట్టిపాలెం ప్రధాన డ్రైనేజీకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించే బాధ్యత మన అందిరిపై ఉందన్నారు. అర్హులైనప్పటికీ సంక్షేమ పథకాలు అందని వారు జగనన్న సురక్ష కార్యక్రమంలో తమ పేర్లను, కావాల్సిన ధ్రువపత్రాల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్న 773 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వెలుగు ఏపీఎం నీలాచలం, పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు ఆమిటి ధనలక్ష్మి, శీరంశెట్టి అప్పరాజు, సచివాలయ ఉద్యోగుల, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష



కూండ్రంలో జగనన్న సురక్ష శిబిరాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ



హైస్కూల్లో జగనన్న గోరుముద్ద పరిశీలిస్తున్న ఆర్డీవో, అధికారులు

అనకాపల్లి రూరల్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష చక్కని వేదిక అని ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కూండ్రం గ్రామంలో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారుల నుంచి వచ్చిన ఆర్జీలు, వాటి తక్షణ పరిష్కారానికి సంబంధించి రికార్డులను పరిశీలించి, ప్రజలతో మాట్లాడి, సమస్యలపై ఆరా తీశారు. ఇలాంటి కార్యక్రమాల వలన అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేసి సురక్షను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఈవోపీఆర్డీ కె ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గోరుముద్ద పరిశీలన

కూండ్రం జిల్లా పరిషత్ హైస్కూల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును ఆర్డీవో చిన్నికృష్ణ అధికారులతో కలిసి పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారంలో ఎన్ని రోజులు గుడ్లు అందిస్తున్నారు, విద్యార్థుల హాజరు తదితర అంశాలకు సంబంధించి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజా సంఘాల ఆందోళన



అనకాపల్లిలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు

అనకాపల్లి రూరల్: మణిపూర్‌లో ముగ్గురు మహిళలపై అఘాయిత్యం చేసి, అందులో ఇద్దరిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనకాపల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ మణిపూర్‌లో ఆరు నెలలు గా మారణ హోమం జరుగుతున్నా అరికట్టడంలో అక్కడి సర్కారు విఫలమైందన్నారు. వరలక్ష్మి, సుభాషిణి, రైతు సంఘం నాయకులు నాయిన బాబు, కొలు రైతు సంఘం ప్రతినిధి బాలకృష్ణ, జి.కోటేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీరామ్, చలపతి పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెంలో సారా విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ పువ్వల సీతారాం (43)ను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సీతారాం తన ఇంటి వద్ద లీటరు రూ.200 చొప్పున 5 లీటర్ల సారా విక్రయిస్తుండగా తమ స్టేషన్ హెచ్‌సీ టి.అప్పలకొండ, సిబ్బంది వెళ్లి పట్టుకున్నట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికం



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని కూండ్రం సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమ ప్రధాన లక్ష్యాన్ని వివరించారు. 11 రకాల ధ్రువపత్రాలను జిల్లా, మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా నేరుగా గ్రామాల్లోనే సేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ధర్మారావు, సర్పంచ్ నందారపు లక్ష్మి, ఎంపీటీసీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు శానాపతి పెంటారావు, ఎలమంచిలి చిన్న రమణ, ఎలమంచిలి సన్యాసి నాయుడు, ఎలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎంపీపీ

అనంతరం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంటా ఫాల్గుణరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అందించిన 70 కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవడంతోపాటు, తద్వారా చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- ప్యూరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో చిన్నికృష్ణ



కూండ్రంలో ఇంటింటి సర్వే తీరును పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి రూరల్: ఎటువంటి లోపాలు, పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ తెలిపారు. శుక్రవారం అనకాపల్లి పట్టణంలోని గాంధీ నగరం, మళ్ల వీధి, మండలంలోని కూండ్రం గ్రామాల్లో ఓటరు జాబితా ప్యూరిఫికేషన్‌ను బీఎల్వోలు ఎలా చేపడుతున్నారో పరిశీలించారు. ఓటరు జాబితా పరిశీలన పకడ్బందీగా చేయాలని సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. జూలై 21 నుంచి వచ్చే నెల 21 వరకూ బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణను తప్పులేకుండా పూర్తి చేయాలన్నారు. ఇంటింటి సర్వేకి వెళ్లినపుడు 18 ఏళ్లు నిండిన వారు ఆ ఇంట్లో ఉంటే వారిని ఓటరుగా నమోదు చేయాలని, ఓటు ఉన్న వ్యక్తి మరణిస్తే వారి ఓటును జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఓటు నమోదులో పేర్లు, చిరునామా తప్పులు లేకుండా ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలన్నారు. ఒకే ఇంటిలో పది మంది ఓటర్లు ఉంటే అలాంటి ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. వాస్తవానికి ఎవరైనా ఓటరు ఆ ఇంట్లో లేకపోతే ఫారం 8 ద్వారా తొలగించాలని, ఒకవేళ వారు వేరే ఇంటికి మారితే ఫారం 7 ద్వారా వారి చిరునామా మార్పు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గంగాధరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు

జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ



ఏటికొప్పాక జెడ్పీ హైస్కూల్ భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

యలమంచిలి: భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు. మండలంలో ఏటికొప్పాకలో రూ.6 లక్షల జెడ్పీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ కాంపౌండ్ వాల్, మరి కొన్ని ప్రజా అవసరాల భవనాల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న సచివాలయంలో మౌలిక వసతులపై స్థానిక మండల పరిషత్ అధికారులతో చర్చించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను పరిశీలించారు.అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులపై స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం లక్కబొమ్మల సొసైటీని సందర్శించి, కళాకారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి ప్రసాదరావు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి సోమశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు సేనాపతి రాము తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లును పరిశీలించిన జేసీ



రైస్ మిల్లు రికార్డులను తనిఖీ చేస్తున్న జేసీ జాహ్నవి

పాయకరావుపేట: మండలంలోని పీఎల్ పురం గ్రామ పరిధిలో గల వెంకట పద్మ రైస్ మిల్లును జేసీ జాహ్నవి శక్రవారం తనిఖీ చేశారు. మిల్లుకు సంబంధించిన రికార్డులను, విద్యుత్ బిల్లులను పరిశీలించారు. జేసీ వెంట తహసీల్దార్ కె.జయప్రకాష్, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, జెడ్పీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్: పరిసరాలను పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, స్వచ్ఛ పరిసరాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య కోరారు. స్థానిక గవరపాలెం నీలకంఠరావు వీధిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో దోమలు వృద్ధి చెందుతాయని, కాలువలు, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, పారిశుధ్యకార్మికులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కె.వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజని, మలేరియా ఇన్‌స్పెక్టర్ గణేష్, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.